
# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



# ముందుమాట

త్యాగరాజ కీర్తనలు తెల్సిన తెలుగేతరులు చాలా మంది అనే మాట: "మాకు కనక తెలుగు వచ్చుంటే ఎంత సంతోషించి ఉండేవాళ్ళమో, ఎందుకంటే త్యాగరాజ కృతులన్నీ అర్ధం అవుతాయి." ఈ మాట వింతగా ఉంటే త్యాగరాజ పంచరత్న కృతులు ఒకసారి చూడండి పూర్తి అర్ధంతో. అది కూడా కష్టంగా ఉంటే, ఎందరో మహానుభావులు అనే కృతిలో "చందురు వర్ణుని అంద చందమును హృదయారవిందమున జూచి బ్రహ్మానందమును బొందువారు" అనేది అర్ధం చేసుకోండి పోనీ. తెలుగు ఎంత అందమైన భాషో చెప్పకనే చెప్తున్నాయికదూ? చిన్నప్పుడు మనం తెలుగు వాచకంలో చదువుకున్న "ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై" అనే పద్యంగానీ, "ఇంతింతై వటుడింతయై.." అనే పద్యం గానీ గుర్తు ఉంటే వాటిని వ్రాసిన పోతన ఎంత మహామహుడో చెప్పడం అనవసరం. తెలుగులో పోతన భాగవతం అంటే తెలుగువాళ్ళు చేసుకున్న మహోన్నతమైన అదృష్టం. తెలుగు పద్యాలు కొంచెం కష్టపడితే (అంటే బాగా కృషిచేసి) రాయొచ్చు. కానీ మనం రాసే పద్యాలు ఎంతకాలం నిలుస్తాయి? పోతన పద్యాలు కలకాలం నిలవడానికీ, మనం రాసేవి మఖలో పుట్టి పుబ్బలో మాడిపోవడానికీ కారణం ఏమై ఉండొచ్చు? నా దృష్టిలో కారణం ఏమిటంటే, భగవత్కృప. పోతన భాగవతం రాయడానికి కారణం "పలికించెడు వాడు రామ భద్రుడట" అని తానే చెప్పుకున్నాడు. మనకీ పోతనకీ అదే తేడా. భగవత్కృప లేకుండా ఇలాంటి పద్యాలు ఎవరేనా రాయ(గల్గ)డం అసంభవం.

భాగవతంలో ఉన్న పద్యాలు చదువుతూంటే ఒక్కొక్కప్పుడు పోతన మీద భగవంతుడు ఎటువంటి కృప చూపించాడో అనిపిస్తుంది. పోతన సహజ పాండితానికి భగవత్కృప తోడైంది - వెరసి మనకి దొరికింది ఒక వజ్రాల గని. పోతన భాగవతంలో పద్యాలు ఎనిమిదో తరగతి విద్యార్ధిక్కూడా సులభంగా అర్ధం అవుతాయి. ఆయనది ద్రాక్షాపాకం. నోట్లోవేసుకుని చప్పరించడమే. ఆయన ఘంట తేనెలో ముంచి రాసాడా అనిపించక మానదు.

తి.తి.దే వారు పోతన భాగవతాన్ని ఐదు సంపుటాలుగా జంధ్యాల పాపయ్య శాస్త్రి సంపాదకుడుగా తీసుకొచ్చారు. తెలుగువాళ్ళందరు కొని దాచుకోవాల్సిన సెట్ అది. ఈ పుస్తకాలు చదువుతూంటే పోతన రసగుళికలు రాద్దాం అనిపించింది. అయితే ఇవి రాయడానికి నాకున్న ఒకే ఒక అర్హత ఏమిటంటే తెలుగు రాయడం చదవడం వచ్చు అని చెప్పుకోవడమే తప్ప ఇంకేమీ లేదు. నిజంగా. నేను రాయబోయేది చాలా మటుక్కు కాపీ, పేస్ట్ వ్యవహారమే. నాకు నచ్చిన పద్యాలూ, నాకు తెల్సున్న కథలూ ఇందులో జొప్పించి రాయడం మొదలు పెట్టాను. ఇవన్నీ ఒక వరుసలో భాగవతంలో ఉన్నట్టూ రాయడం లేదు. ఏ ఘట్టం గుర్తు వస్తే అది రాయడమే. ఇందులో పద్యాలకి అన్నిచోట్లా పూర్తిగా అర్ధాలు ఇవ్వడం లేదని గమనించగలరు. అవి కావాల్స్తే ఇంటర్నెట్లోదొరుకుతాయి. ప్రతి వ్యాసంలోనూ ఆఖరిపేజీలో ఇచ్చిన లింక్ మీద నొక్కి ఈ వెబ్ సైట్ కి నేరుగా వెళ్ళవచ్చు. ఈ వ్యాస పరంపరలో దొర్లే తప్పులన్నీ నావే అని ఒప్పుకోవడానికి ఏమీ సిగ్గుపడటం లేదు.

★★★★★

# 9 వ భాగం

## ధ్రువోపాఖ్యానం - 1

క. శ్రీ విలసితధరణీతన
యావదన సరోజ వాసరాధిప! సిత రా
జీవదళనయన! నిఖిల ధ
రావర నుత సుగుణధామ! రాఘవరామా! [4-1]

మహాభాగవతం చతుర్థ స్కంధంలో వచ్చేది ధ్రువుడి కథ. నిష్కలమైన భక్తితో తపస్సు చేస్తే భగవంతుడు ఎంత త్వరగా కనిపిస్తాడో ఇందులో తెలుసుకోవచ్చు. భగవంతుడు కనిపించేక ఇది కావాలి, అది కావాలి అని అడక్కుండా ధ్రువుడు అంత చిన్న వయస్సులో విష్ణువుని ఏం కోరుకుంటాడో చూస్తే ఆశ్చర్యం కలగకపోక మానదు. ఒకసారి భగవంతుడి 'యత్త్రైలోక మహీయసోపి మహితం సమ్మోహనం మోహనాత్ (నారాయణీయం)' అనే రూపం కనిపిస్తే ఇంక అడగడానికేమి ఉంటుంది?

స్వాయంభువ మనువుకి శతరూప వల్ల ప్రియవ్రతుడూ, ఉత్తానపాదుడూ అనే ఇద్దరు కొడుకులు పుట్టేరు. అందులో ఉత్తానపాదుడికి ఇద్దరు భార్యలు – సునీతీ, సురుచి. సునీతికి పుట్టినవాడే ధ్రువుడు. రెండో భార్య మూలంగా సునీతిని తక్కువగా దాసీదానిలా చూడ్డం మొదలు పెట్టేడు ఉత్తానపాదుడు.

ఓ రోజు మహారాజు సింహాసనం మీద సురుచితో, సురుచికి పుట్టిన కొడుకుని తొడమీద కూర్చోబెట్టుకుని కూర్చుని ఉన్నాడు. అప్పుడు ధ్రువుడు – అంటే రాజుకి పెద్ద కొడుకు, ముందు కాబోయే రాజు – లోపలకి వచ్చి చూసాడు. కుర్రవాడు కదా, తమ్ముడిలాగా తాను కూడా తండ్రి వళ్ళో కూర్చోవాలని ఉబలాటపడ్డాడు. రాజుకి కూడా ధ్రువుడ్ని తొడమీద కూర్చోపెట్టుకోవాలనే ఉంది కానీ ఈ సురుచి మళ్ళీ ఏమి గొడవపెడుతుందో తర్వాత అని నోరు కట్టేసుకుని కూర్చున్నాడు.

సీ. ఒకనాఁడు సుఖలీల నుత్తానపాదుండు
నెఱిఁ బ్రియురాలైన సురుచి గన్న
కొడుకు 'నుత్తముఁ' దన తొడలపై నిడుకొని
యుపలాలనము చేయుచున్న వేళ
నర్థిఁ ద దారోహణాపేక్షితుం డైన
ధ్రువునిఁ గనుంగొని తివక నాద
రింపకుండుటకు గర్వించి యా సురుచియు
సవతి బిడ్డండైన ధ్రువునిఁ జూచి [4-219]

తే. తండ్రి తొడ నెక్కు వేడుక దగిలెనేనిఁ
బూని నా గర్భమున నాఁడె పుట్ట కన్య
గర్భమునఁ బుట్టి కోరినఁగలదె నేఁడు
జనకు తొడ నెక్కు భాగ్యంబు సవతి కొడుక! [4-219-1]

సురుచి పక్కనే ఉండి ఇలా అంది ధ్రువుడితో, "ఒరే సవతి కొడుకా నువ్వు రాజుగారి తొడ ఎక్కాలంటే నా కడుపున పుట్టాలిరా." సాధారణంగా ప్రపంచంలో రోజూ చూసేదే ఈ కథ. పిల్లల్లో ఒకరంటే ఎక్కువ ఇష్టం ఉండడం, రెండోవాణ్ణి తక్కువచేయడం అనేవి మనకి తెలీయకుండా జరిగిపోతూ ఉంటాయి. ఇలా కించపరిచినప్పుడు రెండు రకాలుగా పిల్లలు ప్రతిస్పందించవచ్చు. వాళ్ళు కుచించుకుపోయి జీవితం నాశనం చేసుకోవడం, తల్లినీ తండ్రినీ ద్వేషించి ముందు మానసికంగా, తర్వాత దూరంగా జరగడమో. రెండో విధం అయితే, దీనిమీద పట్టుదల పెంచుకుని అది సవాలుగా తీసుకుని మహామహులుగా ఎదగడమో. చివర్లో మళ్ళీ ఈ సురుచి గురించి చూద్దాం.

క. అదిగాన నీ వధోక్షజు
పదపద్మము లాశ్రయింపు; పాయక హరి నా
యుదరమునఁ బుట్టఁ జేయును,
వదలక యట్లయిన ముదము వఱలెడి నీకున్. [4-220]

అని ఊరుకుందా? పోయి విష్ణువుతో మొరపెట్టుకో వచ్చే జన్మలో అయినా నా కడుపులో పుట్టించమని అనేసింది అందరి ముందూ.

క. అని యీ రీతి నసహ్యవ
చనములు పినతల్లి యపుడు జనకుఁడు వినగాఁ
దను నాడిన దుర్భాషా
ఘనశరములు మనము నాఁటి కాఁటియపెట్టన్. [4-221]

ఇంత అసహ్యంగా మాట్లాడింది తండ్రి విన్నాడు. కానీ ఏమీ చెయ్యలేదు. ఈ మాటలు శూలాల్లా పొడిచేయి ధ్రువుణ్ణి. పరుగెట్టుకుంటూ అమ్మ దగ్గిరకి వెళ్ళేడు.

క. అనఘా! యీ దుఃఖమునకుఁ
బనిలే దన్యులకు సొలయ బలవంతంబై
తన పూర్వ జన్మ దుష్కృత
ఘనకర్మము వెంటనంటఁగా నెవ్వలనన్. [4-228]

ధ్రువుడు అమ్మ దగ్గిరకెళ్ళేలోపుల పరిచారికలు వల్ల వింది కథంతా సునీతి. వచ్చిన ధ్రువుడ్ని చూసి దగ్గిరకి తీసుకుని ఏడుస్తూ ఇలా అంది. "అబ్బాయీ ఇప్పుడు మనం అనుభవించే కర్మలో ఎవరికీ భాగంలేదు. ఇదంతా మనం చేసుకున్నదే, తప్పించుకోలేనిదీను. నీకు ఇవాళే ఇలాగైంది. కానీ నాకు చాలా రోజుల్నుంచీ ఇలాగే ఉంది బతుకు. దాసీ దానిలాగా బతుకుతున్నాను.

క. పెనిమిటి చేతను బెండ్లా
మని కాదు నికృష్టదాసి యనియును బిలువం
గను జాలని దుర్భగురా
లనఁగల నా కుక్షి నుదయ మందిన కతనన్. [4-230]

భర్త చేత భార్య అనిపించుకోలేని స్థితిలో ఉన్నాను ఇప్పుడు. అలాంటి దాన్ని నీకు చేసే సహాయం ఏముంది. అయితే నీ పిన తల్లి చెప్పినదాంట్లో నిజం ఉంది.

సీ. పరికింప నీ విశ్వపరిపాలనమునకై
యర్థి గుణవ్యక్తుఁ డైనయట్టి
నారాయణుని పాదనళినముల్ సేవించి
తగ బ్రహ్మ బ్రహ్మపదంబు నొందె;
ఘనుఁడు మీ తాత యా మనువు సర్వాంతర
యామిత్వ మగు నేకమైన దృష్టిఁ
జేసి యాగముల యజించి తా భౌమ సు
ఖములను దివ్యసుఖముల మోక్ష [4-233]

తే. సుఖములను బొందె నట్టి యచ్యుతునిఁ బరుని
వితత యోగీంద్ర నికర గవేష్యమాణ
చరణ సరసిజ యుగళు శశ్వత్ప్రకాశు
భక్తవత్సలు విశ్వసంపాద్యు హరిని. [4-233-1]

చూడబోతే మీ తాత అయిన మనువూ బ్రహ్మదేవుడూ అచ్యుతుణ్ణి అర్చించి ఆయన పదం పోందేరు. నువ్వు కూడా మీ పినతల్లి చెప్పినట్టే చేయి. మన కష్టాలు హరించేవాడు ఆయనొక్కడే. తపస్సు చేసి ఆయన కరుణ సంపాదించావా, ఇంక నీకు తిరుగులేదు.

వ. నిజధర్మపరిశోభితంబైన యేకాగ్రచిత్తంబున నిలిపి సేవింపుము; అ మ్మహాత్ముని కంటె నీ దుఃఖం బపనయించువాఁ డన్యుం డొక్కరుండు గలండే?" యని పలికినఁ బరమార్థ ప్రాప్తి హేతుకంబులైన తల్లివాక్యంబులు విని తన్నుఁ దాన నియమించుకొని పురంబు వెడలి చను నవసరంబున నారదుండు తద్వృత్తాంతంబెఱింగి, యచ్చటికిం జనుదెంచి, యతని చికీర్షితంబు దెలిసి, పాపనాశకరం బైన తన కరతలంబు నా ధ్రువుని శిరంబునం బెట్టి "మానభంగంబునకు సహింపని క్షత్రియుల ప్రభావం బద్భుతంబు గదా? బాలకుం డయ్యుఁ బినతల్లి యాడిన దురుక్తులు చిత్తంబునం బెట్టి చనుచున్నవాఁ" డని మనంబున నాశ్చర్యంబు నొంది "యో బాలక! సకల సంపత్సమృద్ధం బగు

మందిరంబు దెగడి యొంటి నెందు నేగెదవు? స్వజన కృతం బగు నవమానంబుచే నిను సంతప్తుంగాఁ దలంచెద" ననిన ధ్రువుం డి ట్లనియె; "సపత్నీమాతృ వాగిషుక్షతం బగు వ్రణంబు భగవద్ధ్యానయోగ రసాయనంబున మాపి కొందు" ననిన విని ధ్రువునికి నారదుం డిట్లనియె.
[4-236]

సొంత తల్లే ఇలా అనేసరికి ధ్రువుడికి "నిజంగా ఇదే మంచిది. అమ్మా నాన్నా చేయలేనిది శ్రీహరి చేయగలడు" అనే ధైర్యంతో వెంటనే బయల్దేరేడు. కానీ తపస్సనేది అంత తేలిక కాదు కదా? దారిలో నారదుడు కనబడ్డాడు. సంగతి తెలిసేసరికి మనసులో ఆశ్చర్యం వేసి ఇలా అడిగేడు, "ఇంట్లో ఉండి సుఖంగా ఆటపాటల్లో పడకుండా ఎక్కడికి బయల్దేరావు?" దానికి ధ్రువుడు చెప్తున్నాడు "నా మనస్సులో పినతల్లి మూలంగా వ్రణం ఏర్పడింది, దాన్ని తొలగించుకోవడానికి భగవంతుడి మీద ధ్యానం ఒకటే మందు. దానికోసమే బయల్దేరేను."

అయితే తపస్సనేది సిద్ధించాలంటే ఒక గురువుండాలి ముందు. అయిదేళ్ళ కుర్రాడికి ఇవన్నీ ఏం తెలుస్తాయి? అయినా ఇవి తెలుస్తాయా, తెలియవా అనేది ముఖ్యం కాదు. ధృఢ సంకల్పం ఉంటే మిగతావి అన్నీ అవే వస్తాయి. రామకృష్ణ పరమహంస కూడా ఏ గురువు దగ్గిరకీ వెళ్ళలేదు. ఆఖరికి ఆయన గురువు తోతాపురి గారు వచ్చి నీకు నేను నిర్వికల్ప సమాధి చూపిస్తానురా అంటే 'అయితే అమ్మని అడిగి వస్తా' అన్నారుట, ఎందుకంటే అప్పటికే ఆయన సవికల్పసమాధిలో ఈదులాడుతూ ఉండేవారు. శిష్యుడు తయారుగా ఉంటే గురువే వెదుక్కుంటూ వస్తాడు.

ఇక్కడొక విషయం గమనించారా? అందరి పెద్దవాళ్ళలాగా, "అర్రేరే, నీకు ఇలా అయిందా, నాతో రా నేను మీ నాన్నతో మాట్లాడి ఒళ్ళో కూర్చోబెట్టుకునేలా చేస్తాను" అనలేదు నారదుడు. ఎందుకంటే నాన్న ఒళ్ళో కూర్చోడం అనేది అంత ముఖ్యం కాదు. భగవత్కృప అనేది ముందు, మిగతావి వాటంతట అవే వస్తాయి తర్వాత. గురువు (నారదుడు) ఇక్కడ ధ్రువుణ్ణి పరీక్ష చేస్తున్నాడు, "ఈ కుర్రడిలో ముముక్షత్వం పాలు ఎంతుంది? ఏదో మిఠాయి చూపిస్తే వెనక్కి ఇంట్లోకి వెళ్ళిపోతాడా?" అని. ధ్రువుడు వెనక్కి వెళ్ళిపోతాడా?

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS